రోడ్డుపై వ్యర్థాలు డంప్ చేసిన వారికి రూ.10 వేల జరిమానా



గగన్‌పహాడ్ ప్రాంతంలో రోడ్డుపై వేసిన నిర్మాణ వ్యర్థాలను తొలగింపు చేస్తున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో మట్టి వ్యర్థాలను వేస్తే భారీగా జరిమానాలు విధిస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ సూచించారు. గగన్‌పహాడ్ ప్రాంతంలో అశోక్‌కుమర్ అగర్వాల్ అనే వ్యక్తి రోడ్డుపై నిర్మాణ వ్యర్థాలను వేయడంతో దీనిని గమనించిన జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం రూ.10 వేల జరిమానా విధించారు. అలాగే రోడ్డుపై వేసిన డిబ్రీస్‌ను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మట్టి, నిర్మాణ వ్యర్థాలను తీసుకువచ్చి ఎవరు లేని ప్రాంతాలు, ఖాళీ స్థలాలు వేయడం సరికాదన్నారు. ఇలాంటి వాటిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు కూడా భారీ ఎత్తున వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

మైలార్‌దేవ్‌పల్లి: కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ముందుండి పోరాడుతుందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు, కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ జాజాల రుద్రకుమార్, సీఐటీయూ మండల నాయకులు బజ్జలకూర స్వామి అన్నారు. గత మార్చి నెలలో ప్రమాదవశాత్తు గాయమైన కార్మికుడికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం పరిశ్రమ యజమానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ.. కాటేదాన్ పారిశ్రామికవాడలో మోడ్ వర్క్స్ ప్లేవుడ్ పరిశ్రమను నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో కర్ణాటకకు చెందిన బైరవనాథ్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు గాయాలకు గురయ్యాడన్నారు. అప్పటి నుంచి యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. బాధితుడు సీఐటీయూ దృష్టికి తీసుకురావడంతో వెంటనే యాజమాన్యంతో చర్చలు జరిపి తగిన న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.



మోడ్ వర్క్స్ ప్లేవుడ్ పరిశ్రమలో కార్మికుడికి న్యాయం చేయాలని కోరుతున్న సీఐటీయూ నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన డీసీ



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ పరిశీలించారు. బుద్వేల్‌లో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ యాదయ్య ఆధ్వర్యంలో చేపడుతున్న సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే చేపడుతున్న అంశాలను పరిశీలించారు. సర్వే సందర్భంగా సిబ్బంది దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులను పరిశీలిస్తున్నారు. అలాగే హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో అందజేసిన యాప్ ద్వారా వారి స్థితిగతులను యాప్‌లో పొందుపరుస్తున్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్ల పరిధిలో మొత్తం 54 వేల దరఖాస్తులు ఉన్నాయన్నారు. ఈ దరఖాస్తులను సిబ్బందికి అందజేసి ప్రతిరోజూ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రవి కుమార్ మాట్లాడుతూ..సర్వేకు వచ్చే సిబ్బందికి సహకరించి తమ పూర్తి వివరాలను అందజేయాలన్నారు.

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను సోమవారం తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డి.కొండలు ముదిరాజ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికులకు 75 శాతం రిజర్వేషన్‌పై అరగంట పాటు చర్చించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టింది చట్టం చేసేలా కృషి చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం అయ్యేలా చట్టం వచ్చేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కొండల ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ రాజ్, జనరల్ సెక్రటరీలు బి.గట్టయ్య, విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లు అర్జున్ రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, మహిపాల్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కొండలు ముదిరాజ్ తదితరులు

ప్రజా సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సబితాఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు వేసి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చిన అందులో బీఆర్ఎస్‌దే విజయం అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ చేస్తున్న అక్రమాలు అన్ని ప్రజలు గమనిస్తున్నారని.. రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్, భగవాన్‌దాస్, రత్నం, ఉప్పల్ శ్రీను, కార్తీక్‌ముదిరాజ్, ఆనంద్, లక్ష్మణ్, సంతోష్, విజయ్, నజీబ్, ఫెరోజ్, రాజు, లోకేష్, రిషి, వేదాంత, వినోద్, సవిత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేయాలి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారందరినీ త్వరగా కలిసి సర్వేను పూర్తి చేయాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మేనేజర్ శ్రీధర్‌తో కలిసి అలకాపూర్ టౌన్‌షిప్‌లోని రోడ్డు నెంబర్:1లో దరఖాస్తులు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి సిబ్బందితో పాటు సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎలాంటి తప్పులు లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సంపూర్ణంగా సర్వే చేసి వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిల్ కలెక్టర్‌లు పాల్గొన్నారు.



అలకాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి సర్వే చేస్తున్న కమిషనర్, మేనేజర్

ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో ప్లానింగ్ సెక్షన్‌పై రెండు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ ఫిర్యాదులను సంబంధిత విభాగం అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. వీటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సగం, సగం పనులు..
సమస్య మళ్లీ మొదలు..

పూర్తి స్థాయిలో గుర్రపుడెక్కను తొలగించాలంటున్న స్థానికులు



శేరిలింగంపల్లి: సగం..సగం పనులతో సమస్య మళ్లీ మొదటికే వస్తోంది. గుర్రపుడెక్కను కొంత మేర తొలగించి వదిలేయడంతో తిరిగి చెరువంతా వ్యాపిస్తోంది. దీంతో నిధులు బూడిదలో పోసిన పన్నీరేనని స్థానికులు విమర్శిస్తున్నారు. శేరిలింగంపల్లిలోని చాకలివానికుంటలో గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించకపోవడంతో సమస్య పునరావృతమవుతోంది. దీనికితోడు దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం నీటిపారుదల శాఖ చాకలివానికుంట అభివృద్ధికి రూ.26 లక్షలు కేటాయించింది. ఆయా నిధులతో చెరువు చుట్టూ ఫెన్సింగ్, కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. కానీ ఆదర్శనగర్ వైపు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్ వేసే సమయంలో వాటిని తొలగించారు. ఉన్న వాకింగ్ ట్రాక్ అంతా చెత్తా చెదారం, వ్యర్థాలతో నిండిపోయింది. 2021లో జీహెచ్ఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో చెరువులోని గుర్రపుడెక్కను తొలగించారు. కానీ తిరిగి యథాస్థితి నెలకొంది. చెరువును అభివృద్ధి చేయాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

చాకలివాని కుంటలో పెరుగుతున్న గుర్రపుడెక్క



చాకలివానికుంటలో ఎఫ్‌టీసీ మిషన్‌తో గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, ఎంటమాలజీ అధికారులు (ఫైల్)

- ఈ ఏడాది జూలై నుంచి ఎఫ్‌టీసీ మిషన్‌తో 4 నెలల పాటు గుర్రపుడెక్కను తొలగించారు.
- కానీ అధికారులు అక్టోబర్‌లో మసీదుబండలోని కుంటకు ఎఫ్‌టీసీ మిషన్‌ను తరలించారు.
- దీంతో రెండునెలల్లోనే తిరిగి గుర్రపుడెక్క విస్తరించింది
- చెరువులలో గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు ఉపయోగపడుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు.

నవ వధువు అదృశ్యం



హమీదా బేగం

రాజేంద్రనగర్: పెళ్లైన పది రోజులకే ఓ నవ వధువు అదృశ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం ..దర్గా ఖలీస్ పరాఫత్ కూతురు హమీదా బేగం (21)కు పది రోజుల క్రితం ఇదే ప్రాంతానికి చెందిన యువకుడితో వివాహం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటికి వెళ్లిన బేగం తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకపోవడంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లక్డారంలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్

రాయదుర్గం: హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లక్డారం గ్రామంలో వింటర్ స్పెషల్ క్యాంప్‌ను ప్రారంభించినట్లు యూనిట్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య తెలిపారు. ఆయన సోమవారంహెచ్‌సీయూలో మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజులపాటు లక్డారం గ్రామంలో 40 మంది వాలంటీర్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్ పర్యవేక్షణలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామంలో ప్రజల ఆరోగ్యం, విద్యా సౌకర్యాలు, డ్రగ్స్ నివారణ, సైబర్ క్రైమ్, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రతి వింటర్, సమ్మర్‌లలో క్యాంప్‌లను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు.

హెచ్‌సీయూ.. వీల్‌చైర్ ఫ్రెండ్లీగా..

వీసీ బీజేరావు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సోమవారం వీల్‌చైర్ సౌకర్యాన్ని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు లాంఛనంగా ప్రారంభించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని అకడమిక్ యూనిట్లు, పరిపాలనాభవనాలు, ఆడిటోరియం, లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లు, గెస్ట్ హౌస్‌లలో ఈ సౌకర్యాన్ని కల్పించారు. అనంతరం వీసీ బీజేరావు మాట్లాడుతూ అన్ని భవనాలను వీల్‌చైర్ ఫ్రెండ్లీగా మార్చాలని అధికారులకు సూచించారు. క్యాంపస్‌లో ఇప్పటికే పలుచోట్ల ర్యాంప్‌లు నిర్మించారని, అన్ని చోట్లా వీల్‌చైర్లు అందుబాటులోఉంచి దివ్యాంగులు సాఫీగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, ఐఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘనశ్యామ్‌కృష్ణ, డిప్యూటీ రిజిస్ట్రార్(ఎస్టేట్ సెక్షన్) ప్రొఫెసర్ వపన్ కుమార్‌పమ్మి, అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ యువగళం గ్రేటర్ అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్

రాయదుర్గం: బీసీ యువగళం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా నీరుడి కిరణ్‌కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. బీసీ యువగళం రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌గౌడ్ సోమవారం నగరంలో రాయదుర్గంకు చెందిన కిరణ్‌కుమార్‌కు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీసీ యువతను చైతన్య పరిచేందుకు చిత్తశుద్ధి కృషి చేస్తామన్నారు. బీసీ యువగళంను పటిష్టం చేయడానికి చర్యలు చేపడతామన్నారు.

నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు

అత్తాపూర్: అత్తాపూర్‌లో రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్తాపూర్ పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే ఎలివేటెడ్ వే హనుమాన్ టెంపుల్ 117 పిల్లర్ నెంబర్ నుంచి ఇస్తాసిటీ మార్గం గుండా లంగర్‌హౌస్ వెళ్లే రోడ్డు ఎక్స్‌టెన్షన్ అక్టోబర్ 16న ప్రారంభించారు. సుమారు కిలోమీటర్ వరకు రోడ్ ఎక్స్‌టెన్షన్‌లో భాగంగా కంకర వేసి రోడ్డు రోలర్‌తో తొక్కించి వదిలేశారు. దాదాపు రెండు నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో ఆ మార్గం గుండా వెళ్లే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి యుద్ధప్రతిపాదికన పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అత్తాపూర్ మూసీ పరీవాహక ప్రాంతంలో రోడ్డుపై మట్టి, కంకర వేసి వదిలేసిన దృశ్యం

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడిపూజ



పూజల్లో అయ్యప్ప స్వాములు, భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.సాహితి బాబురావు గురుస్వామి ఇంట్లో సోమవారం అయ్యప్ప స్వామి పడి పూజా కార్యక్రమం జరిగింది. పూజారి సూరిబాబు గురుస్వామి పూజలు నిర్వహించారు. బాబురావు కుమారుడు జి.ఆశీష్ కన్నెస్వామి మొట్ట మొదటిసారి అయ్యప్ప స్వామి మాలను వేశారు. తల్లిదండ్రులు జి.స్వరూప, అంజయ్య అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలి తీరుపై సీఎస్‌కు ఫిర్యాదు

శంషాబాద్: హుడా కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి తీరుపై న్యూ హుడా కాలనీ అధ్యక్షుడు, మాజీ సైనికుడు, పాఠశాల కమిటీ అధ్యక్షుడు వి. జనార్దన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానికంగా మీడియాతో మాట్లాడారు. బదిలీ ప్రక్రియలో భాగంగా హుడా కాలనీ పాఠశాలలో ఆమె ప్రధానోపాధ్యాయురాలిగా చేరారు. ఆమె వ్యవహార తీరుతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. గతంలో రాష్ట్ర స్థాయి అవార్డులు సొంతం చేసుకున్న పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థులు అపరిశుభ్రమైన వాతావరణంలో చదువుతున్నారన్నారు. విద్యార్థుల చేత అన్ని రకాల పరిశుభ్రత పనులు చేయిస్తోందన్నారు. పాఠశాలకు దక్కిన అవార్డులను సైతం ఆమె తొలగించి వేసిందన్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే తమపై ఎదురుదాడికి దిగుతోందని ఆయన ఆరోపించారు. పలుమార్లు ఎంఈఓ, డీఈఓలకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యూనిఫాం, నోట్ పుస్తకాలు పంపిణీ



యూనిఫాం, నోట్ పుస్తకాలు అందిస్తున్న రవికుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్

గచ్చిబౌలి: పేద విద్యార్థులకు సేవ చేయడం బాధ్యతగా గుర్తించాలని మాజీ ఎమ్మెల్యే సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మసీద్‌బండలో జడ్పీహెచ్‌ఎస్‌లో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సెక్రెటరీ రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లు తమ టస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, శ్రీనివాస్, సదానంద్‌యాదవ్, ఆంజనేయులు, సాగర్, శ్రీశైలం, అరుణ్‌కుమార్, పద్మ పాల్గొన్నారు.

రంగనాథ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి అమ్మవారి ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నేటి నుంచి జనవరి 15వ తేదీ వరకు ప్రతిరోజూ ఆలయంలో ఉదయం 5 నుంచి 8 గంటల వరకు గోదా దేవి అమ్మవారి తిరుప్పావై పారాయణం, శత్తుముర్తై, తీర్థ ప్రసాద గోష్టి తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ ప్రతినిధి శృంగారం శేషాచార్యులు తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలను పరిశీలించిన కలెక్టర్



శంషాబాద్: గ్రూప్–2 పరీక్షలను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. పట్టణంలోని చైతన్య కళాశాలలో ఉన్న కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల హాజరుతో పాటు ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో మౌలిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి తదితరులు

అత్తాపూర్: బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీల కూడల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసి అన్ని బస్సులు ఆగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బుద్వేల్ రైల్వేస్టేషన్ కూడలి వద్ద బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారన్నారు. కాటేదాన్, శ్రీరామ్ కాలనీ, నేతాజీ కాలనీ ప్రజల ఇబ్బందులను పరిశీలించి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లుట్ల జగన్, వినయ్‌రెడ్డి, మాగాని శివ తదితరులు పాల్గొన్నారు.

టీహబ్ - న్యూరెలిక్ ఎంఓయూ

రాయదుర్గం: పరివర్తనాత్మక ఆవిష్కరణలను సృష్టించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని టీహబ్ ఇన్‌చార్జీ సీఈఓ సుజిత్ జాగిర్దార్ పేర్కొన్నారు.హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో న్యూరెలిక్ సంస్థతో టీహబ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు అవసరమైన వనరులు, మార్గదర్శకత్వం, భాగస్వామ్యాలతో స్టార్టప్‌లకు సాధికారత కల్పించడం జరుగుతుందన్నారు. న్యూరెలిక్ సంస్థ సీఈఓ అషన్‌విల్లీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న తమ కస్టమర్ల అవసరాలను తీర్చడానికి ఈ ఒప్పందం అవకాశం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో టీహబ్, న్యూరెలిక్ సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఒప్పందం చేసుకున్న టీహబ్ ఇన్‌చార్జ్ సీఈఓ సుజిత్‌జాగిర్దార్, న్యూ రెలిక్ సంస్థ సీఈఓ అషన్‌విల్లీ తదితరులు